క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో రాజరాజేశ్వరి దేవస్థానం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు

ఒంగోలు మెట్రో: స్థానిక గద్దలగుంట బుర్ర బావి దగ్గర శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానంలో త్రయోవింశతి 23వ వార్షిక మహాకుంభాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం ఎనిమిది గంటలకు వేదిక రత్న, వైదికాగమ, నిత్యాగ్ని హోతులు కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ గ్రహణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, దీక్ష గ్రహణం పూజాక్రతువులు నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటలకు మృత్య గ్రహణం, అంకురారోపణ, రక్షాబంధనం, కలశస్థాపన, అమ్మవారికి పసుపు తీర్థ అభిషేకం, కళశ వాహన పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శనం చేసుకున్నారు.

నిరుద్యోగులను దగా చేసిన కూటమి

- 23న యువత పోరును విజయవంతం చేయాలి
- వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి

సంతనూతలపాడు: నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం దగా చేసిందని, అందుకు నిరసనగా ఈ నెల 23వ తేదీ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని పార్టీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలులో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు. సంతనూతలపాడులోని డీసీ కాంప్లెక్స్‌లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ యువత పోరు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించారన్నారు. యువత కోసం ఏటా 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని.. లేదంటే తమ కాలర్ పట్టుకోవాలని నారా లోకేష్ పలు సమావేశాల్లో చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్కరికి కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాటం చేయడంతో అరకొరగా తల్లికి వందనం నిధులు విడుదల చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చామని, ఎవరైనా ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టాలని చూస్తే వారి నాలుక మడత పెడతామని సీఎం చంద్రబాబు నాయుడు బెదిరింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రూ.3 వేలు ఇచ్చారా.. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు రూ.1500, 50 సంవత్సరాలు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ రూ.4 వేలు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేలు ఇచ్చారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేపట్టిన యువత పోరుకు నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు కొండ్రాజు శివన్నారాయణ, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు గంగవరపు రిషి, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు పతకమూరి వెంకట సుబ్బయ్య, ప్రచార కమిటీ నాయకుడు తేళ్ల అనిల్ కుమార్, నాయకులు కరుకు సుబ్బారావు, వల్లెపు శ్రీనివాసరావు, తానిపర్తి శేషిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళులు



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు సాదినేని వెంకటరావు తండ్రి, పార్టీ సీనియర్ నాయకుడు సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. శనివారం నిర్వహించిన దశదినకర్మకు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, తదితరులు హాజరై సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, సర్పంచ్ మక్కెన రాజేంద్ర కుమార్, కిష్టపాటి శ్రీనివాసరెడ్డి, బ్రహ్మయ్య, మూలె రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలో స్వర్ణాంధ్ర యాప్ వినియోగించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు

మద్దిపాడు: అన్ని పంచాయతీలలో పన్నుల వసూలుకు స్వర్ణాంధ్ర యాప్‌ను పంచాయతీ కార్యదర్శులు వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకట నాయుడు ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలలో వసూలు చేసే పన్నుల కోసం స్వర్ణాంధ్ర యాప్ తీసుకొచ్చిందని తెలిపారు. పంచాయతీలలో వసూలు చేస్తున్న పన్నుల రికార్డులను పరిశీలించి కార్యదర్శులకు సలహాలు, సూచనలు చేశారు. పంచాయతీల్లో ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు ఎంత పన్నులు వసూలు చేయాలి, ఎంత వసూలు చేశారు, ఎంత జమ చేశారనే విషయం రికార్డులలో స్పష్టంగా ఉండాలని తెలిపారు. పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, ఇతర సదుపాయాలు కల్పించాలంటే పంచాయతీల మూలధనానికి ఆధారమైన పన్నులను నూరుశాతం వసూలు చేయాలని చెప్పారు. గ్రామ పంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో డీఎస్వీ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో కే రఘుబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



సంతనూతలపాడులో యోగా చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సంతనూతలపాడు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో డి.సురేష్ బాబు పర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు యోగా చేశారు. రిసోర్స్ పర్సన్‌గా చిలకపాడు హైస్కూల్ ఉపాధ్యాయుడు పీఎంకే ఆత్రేయ వ్యవహరించారు. తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, ఎంపీపీ బుడంగుంట విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, ఎంఈఓ డి.వెంకారెడ్డి, మాజీ సర్పంచ్ రంపతోటి అంకారావు, మాజీ జెడ్పీటీసీ తన్నీరు శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చీమకుర్తి/చీమకుర్తి రూరల్: చీమకుర్తిలోని గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయ కుమార్ హాజరయ్యారు. చీమకుర్తి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్‌తో పాటు పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 13 వేల మంది యోగాంధ్రలో పాల్గొన్నట్లు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. చీమకుర్తి మండలంలోని చీమలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. తొర్రగుడిపాడులో ఎంఈఓ శివాజీ యోగాంధ్రలో పాల్గొన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు.

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఎంపీడీఓ డీఎస్వీ ప్రసాద్, తహసీల్దార్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు.

ఒంగోలు సిటీ: స్థానిక పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో యోగా దినోత్సవం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ శివరాం తెలిపారు. శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్ ఫుల్ నెస్ యోగా శిక్షకులు జీవీ శేషయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, కె.బ్రహ్మానందం పాల్గొని విద్యార్థులతో యోగాసనాలు వేయించారు.

ఒంగోలు సబర్బన్: స్థానిక 19వ డివిజన్‌లోని హౌసింగ్ బోర్డుకాలనీ పార్కులో శనివారం యోగా డే నిర్వహించారు. పలువురు కార్పొరేటర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఒంగోలు మెట్రో: నగరంలోని కేశవస్వామిపేటలో ప్రసన్నచెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానాల ప్రాంగణంలో యోగా డే నిర్వహించారు. యోగా గురువు ప్రసాద్, శిష్య బృందం, దేవస్థాన అర్చకులు, కార్యనిర్వహణాధికారి ఆర్.శివశంకర్ పాల్గొని యోగా చేశారు. ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్ వద్ద ఉన్న శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో యోగా గురువు హరికృష్ణ సారథ్యంలో బోడపాటి శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి పర్యవేక్షణలో యోగా డే నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జీవీ శివారెడ్డి, బొమ్మల కోటేశ్వరి యోగా డే నిర్వహించారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు క్లబ్ అంతర్జాతీయ అదనపు కోశాధికారి పువ్వాడ నాగ వెంకట నారాయణ తెలిపారు. వాసవీ జిల్లా 205లోని రీజియన్ 4లో ఐదు ఒంగోలు క్లబ్స్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మధుమేహ పరీక్ష శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ సూచించిన కార్యక్రమాలలో భాగంగా చర్మకారులకు అవసరమైన పరికరాలు అందించారు. రైతులు, మాజీ సైనికులను సత్కరించారు. మానసిక రుగ్మత కలిగిన విద్యార్థులకు అవసరమైన కిట్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. మాతా శిశు వైద్యశాలలో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. గెస్ట్ ఆఫ్ హానర్ అచ్యుత శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

30లోపు ఎల్పీఎంలు సరిచేయించుకోవాలి

సంతనూతలపాడు/మద్దిపాడు: మండలాల్లో భూముల రీ సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్పీఎంలను ఈ నెల 30వ తేదీలోపు సింగిల్ ఎల్పీఎంలుగా రైతులు సరిచేయించుకోవాలని సంతనూతలపాడు తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి, మద్దిపాడు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తర్వాతే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రైతులు అర్హత పొందుతారన్నారు. లేకుంటే ఎక్కువ భూమి ఉన్నట్లు చూపించి పథకాలకు అనర్హులుగా చూపిస్తోందన్నారు. జాయింట్ ఎల్పీఎం నంబర్లున్న వారు ఈ నెల 30వ తేదీలోపు హక్కు పత్రాలు తెచ్చుకుని సింగిల్ ఎల్పీఎం నంబర్లుగా సబ్ డివిజన్లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

స్మార్ట్ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలి



మాట్లాడుతున్న చీకటి శ్రీనివాసరావు, రమేష్

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి బిగిస్తున్న స్మార్ట్ మీటర్ల వలన రానున్న రోజుల్లో ప్రజలకు కష్టనష్టాలు తప్పవని, అంతులేని దోపిడీకి దారితీసే స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని ప్రజలందరూ అడ్డుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యుడు జీ రమేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. షాపులు, చిన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాత 10 రెట్లు కరెంటు చార్జీలు పెరిగాయని తెలిపారు. నూటికి 6 పైసలు ఉన్న విద్యుత్ సుంకాన్ని 100 పైసలకు పెంచారని చెప్పారు. ఈ మీటర్ల ఖర్చు సైతం వినియోగదారులే భరించాల్సి వస్తోందన్నారు. సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ.8,927, త్రీ ఫేజ్ మీటర్‌కు రూ.17,286ను 93 నెలల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. రాష్ట్రం మొత్తం మీద రెండు కోట్ల మీటర్లు బిగించేందుకు అదానీ కంపెనీకి కాంట్రాక్ట్ ఇచ్చారన్నారు. దీని వలన 25 వేల కోట్ల రూపాయల భారం ప్రజలపై పడుతోందని చెప్పారు. మన సొమ్ముతో వేసిన విద్యుత్ లైన్లు, స్తంభాల నుంచి ప్రైవేటు కంపెనీలు మనకు విద్యుత్ సరఫరా చేస్తాయని, మనడబ్బుతో వాళ్లు కోట్ల రూపాయలు కొళ్లగొడతారని ఆరోపించారు. ప్రైవేటు మొబైల్ కంపెనీలైన రిలయన్స్, ఎయిర్‌టెల్ తరహాలో స్మార్ట్ మీటర్ల రూపంలో అదానీ కంపెనీ దోచుకునేందుకు కేంద్రం తలుపులు తెరిచిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బులు చెల్లించి రీచార్జ్ చేసుకోవాలని, ఇక నుంచి ఇంటికి వచ్చి రీడింగ్ తీసేవిధానం ఉండదని అన్నారు. రీచార్జి అయిపోయిన వెంటనే దానికదే కరెంటు కట్ అవుతుందన్నారు. ఇప్పటిలాగా 15 రోజుల వరకు ఆగి కరెంటు బిల్లులు చెల్లించే అవకాశం ఉండదన్నారు. కరెంటు చార్జీలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాగానే సర్దుబాటు చార్జీల పేరుతో 15,485 కోట్ల రూపాయల భారాన్ని ప్రజల మీద వేసిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు అడ్డుకోకుంటే రానున్న రోజుల్లో జేబులు ఖాళీ అవడం ఖాయమన్నారు. ప్రజలంతా మూకుమ్మడిగా స్మార్ట్ మీటర్ల బిగింపును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

ఉప్పు రైతుల సమస్యలు పరిష్కరించాలి



తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీని కోరుతున్న ఉప్పు రైతులు

కొత్తపట్నం: మండలంలోని ఉప్పు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తపట్నం సాల్ట్ మాన్యుఫాక్చర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ సభ్యులు శనివారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉప్పు కొఠారు రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము పండించిన ఉప్పు అమ్ముకోవడానికి సక్రమమైన రోడ్డు మార్గం లేనందున తక్కువ ధరకు విక్రయిస్తున్నామన్నారు.

రైతుకు అధిక నష్టం వాటిల్లుతోందని తెలిపారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా పడటం వలన ఉత్పత్తి తగ్గి రైతుకు నష్టం వచ్చిందన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఉప్పు కొటార్లకు మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. 2005లో ఉప్పు కొఠారులకు పట్టాలిస్తే.. ఇంత వరకు ఆన్‌లైన్ చేయకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వరదలు వచ్చినప్పుడు, వర్షం పడినప్పుడు ఉప్పు కొఠారుల్లో నీరు చేరి మేట వేసి ఉప్పు ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందన్నారు. రక్షణ కట్టకు నిధులు కేటాయించి కట్ట ఏర్పాటు చేయాలని కోరారు. కలెక్టర్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను కూడా కలిసినట్లు ఉప్పు రైతులు తెలిపారు. కార్యక్రమంలో సాల్ట్ సొసైటీ అధ్యక్షుడు నాటారు ఆంజనేయులు, కార్యదర్శి సునీల్, సభ్యులు తంబి సురేష్, పిచ్చయ్య, శ్రీహరి, భూషణం, రాగాల కోటేశ్వరరావు, కోడూరి శ్రీను, పుచ్చలపల్లి లక్ష్మణ, మహిళా రైతులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో పచ్చదనం-పరిశుభ్రత

ఒంగోలు: జిల్లా న్యాయస్థాన భవనాల సముదాయం ఆవరణలో శనివారం పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి టి.విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఇతర జిల్లా న్యాయమూర్తులు పి.లలిత, ఎ.పూర్ణిమ, సీనియర్ సివిల్ జడ్జిలు ఎస్.హేమలత, జూనియర్ సివిల్ జడ్జిలు భానుసాయి, ఎస్.కోమలవల్లి, నవ్యశ్రీ, వెంకటేశ్వరరావుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రతినెలా 3వ శనివారం క్లీన్ అండ్ గ్రీన్ డేగా హైకోర్టు ప్రకటించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా న్యాయ భవనాల సముదాయం ఆవరణలో చెత్త తొలగింపు, పాత సామగ్రి తొలగింపు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాన్ని పరిపాలనాధికారి ఎస్.ప్రసన్నకుమారి, సూపరింటెండెంట్ చాకిరి సుధాకర్, తదితరులు పర్యవేక్షించారు.

నేడు మెగా వైద్య శిబిరం

సంతనూతలపాడు: వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ డాన్ టు డస్క్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం ప్రాంగణంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వాసవీ క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు తెలిపారు. ఒంగోలు ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులు పాల్గొని పరీక్షలు చేసి చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రూపాయి ఖర్చులేకుండా యోగాతో ఆరోగ్యం

ఒంగోలు టౌన్: ఒక్క రూపాయి ఖర్చులేకుండానే యోగా ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తుందని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీసులు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో యోగా సాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యోగా భారతీయ సంస్కృతిలో భాగమని అన్నారు. యోగా అంటే కేవలం ఆసనాలు వేయడం మాత్రమేకాదని చెప్పారు. శరీరం, మనసు మధ్య సమతుల్యం చేసే గొప్ప సాధనమని చెప్పారు. యోగా మానసికంగా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి తద్వారా జీవితంలో ఎదురయ్యే సమస్యలను ఒంటిచేత్తో ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని, నిత్యం ఒత్తిడికి లోనయ్యే పోలీసు ఉద్యోగులు, సిబ్బంది యోగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. యోగా గురించి కుటుంబ సభ్యులకు కూడా వివరించి చెప్పి వారి చేత సాధన చేయించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐలు మేడా శ్రీనివాసరావు, హజరత్తయ్య, పాండురంగారావు, సూర్యనారాయణ, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఎస్సైలు, యోగా గురువు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జైలులో...

మానసిక ప్రశాంతతకు చక్కటి పరిష్కారం, నిత్య ఆరోగ్యానికి ఏకైక మార్గం యోగా ఒక్కటేనని జిల్లా జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి తెలిపారు. జిల్లా కారాగారంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. యోగా ద్వారా జీవనశైలిలో మంచి మార్పు వస్తుందని, సహనం, ఓర్పుతో జీవితాన్ని గెలిచేందుకు మార్గం సుగమం చేస్తుందని చెప్పారు. యోగా గురువుల సూచనలతో ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలను ఖైదీలు ఉత్సాహంగా సాధన చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జైలర్ మజ్జి అప్పలనాయుడు, డిప్యూటీ జైలర్ కె.యలమందయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి కళ్యాణం



విశేష అలంకరణలో సువర్చలా సమేత అభయాంజనేయస్వామి



హోమగుండం వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దంపతులు

ఒంగోలు సిటీ: ఒంగోలు రూరల్ మండల పరిధిలోని కరవది గ్రామంలో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి కళ్యాణ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ఉత్సవం ప్రారంభమైంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యాహవాచనము, హనుమత్ కలశ స్థాపన, పంచసూక్తము, మన్యుసూక్తసహిత, హనుమత్ మూలమంత్ర, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనుమత్ సుదర్శన హోమంలో ఏడు జంటలు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సువర్చలా హనుమత్ కళ్యాణం, మంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో శ్రీ సువర్చలా సమేత అభయాంజనేయస్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.